www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 28 మే 2024
5
అన్నమయ్య

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపుపై సర్వే

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమయ్య జిల్లా డిఇఒ శివ ప్రకాష్‌రెడ్డి, సమ్మిళిత సమన్వయకర్త జనార్ధన్, మండల విద్య శాఖ అధికారులు రఘునాథ్‌రాజు, సుబ్బరాయుడు ఆదేశాల మేరకు భవిత కేంద్రంలోని ఉపాధ్యాయులు నాగమణి, మాధవి దివ్యాంగులైన పిల్లలకు సోమవారం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా భవిత టీచర్లు మన్నూరు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి దివ్యాంగులైన పిల్లలను గుర్తించి కౌన్సెలింగ్ చేపట్టారు. వారికి భవిత కేంద్రంలో కల్పించే సౌకర్యాలు గురించి వివరించి భవిత కేంద్రానికి చేరుకునే విధంగా దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులకు వివరించారు.

పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న భవిత సిబ్బంది

మెజార్టీల పైనే పందేలు!

బూత్‌లు, మండలాల వారీగా మెజార్టీల మదింపు
షర్మిల గెలుపుపైనా పందేలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో పందేల జోరు పతాక స్థాయికి చేరుకుంది. సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన వైసిపి, టిడిపి, కాంగ్రెస్ అభ్యర్థులు సాధించే మెజార్టీలపై బెట్టింగులు పెద్దఎత్తున నడుస్తున్నాయి. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలు, పంచాయతీలు, పోలింగ్‌బూత్‌ల ఆధారంగా ఏ పార్టీకి మెజార్టీ ఎంత మెజార్టీలను సేకరించి, దాని ఆధారంగా బెట్టింగులకు పాల్పడు తున్నారు. వైఎస్‌ఆర్ జిల్లాలో ఏడు, అన్నమయ్య జిల్లాలో ఆరింటిని కలిపితే మొత్తం 13 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. కడప జిల్లాలో 2,035 పోలింగ్ బూత్‌లు, అన్నమయ్యలో 1,604 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలు నువ్వా నేనా అనే రీతిలో సాగిన నేపథ్యంలో ఎవరి మెజార్టీ ఎంత అనే అంశంపై నాయకులు గణాంకాల సేకరణపై దృష్టి సారించారు. జిల్లాలోని ఏగ్రామంలో ఎవరికి ఎంత, పంచాయతీల ఎవరిది మెజార్టీ, పోలింగ్ బూత్‌ల ఆధిక్యం ఎంత వెరసి మండలంలో ఎవరికి మెజార్టీ ఎంత అనే అంచనాల ఆధారంగా మెజార్టీలను గణించే పరిస్థితి కనిపిస్తోంది. వైఎస్‌ఆర్, అన్నమయ్య జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పులివెందుల మినహా మిగిలిన నియోజకవర్గాల్లో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారో కచ్చితంగా చెప్పలేని పరిస్థితి కనిపిస్తోంది. ఇటువంటి సందిగ్ధ పరిస్థితుల్లో బెట్టింగురాయుళ్లు చెలరేగిపోతున్నారు. ఇదే పరిస్థితి మే నెలాఖరు వరకు కనిపించే అవకాశం ఉంది. జూన్ ఒకటి నుంచి మరో రకమైన పోటీ నెలకొనే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీలు వైసిపి, టిడిపి, కడప పార్లమెంట్‌పై వైఎస్ షర్మిల గెలుపు అవకాశాలపై పందేల జోరు కొనసాగుతోంది. పార్లమెంట్ పరిధిలోని పులివెందుల మొదలుకుని మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో ఎక్కడ ఎంత మెజార్టీ లభించే అవకాశం ఉందనే అంచనాల బేరీజు వేసుకుని పందేలు కాస్తుడడం గమనార్హం.రూ.లక్ష మెజార్టీకి రూ.లక్షన్నర నుంచి రూ.మూడు లక్షల వరకు ఇస్తామనే పద్ధతిలో బెట్టింగులు సాగుతుండడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఫలానా పోలింగ్ బూత్‌లో కూటమికి మెజార్టీ, ఫలానా పోలింగ్ బూత్‌లో వైసిపికి మెజార్టీ వస్తుందనే అంచనాలతో పందేలకు పాల్పడుతున్నారు. ఇలా ప్రతి నియోజకవర్గంలో రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు పందేల జోరు కొనసాగుతోంది. మధ్యవర్తుల సహకారంతో ప్రామిసరీ బాండ్లు రాయించుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఈ నెల 13న పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే. జూన్ నాలుగున కౌంటింగ్ జరుగనుంది. పోలింగ్ నుంచి కౌంటింగ్ వరకు 20 రోజుల వ్యవధిలో భారీ ఎత్తున బెట్టింగులకు పాల్పడిన పరిస్థితి కనిపిస్తోంది. వైఎస్‌ఆర్, అన్నమయ్య జిల్లాల్లో కడప, కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరు, రాయచోటి, రాజంపేట నియోజకవర్గాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల గెలుపోటములపై సామాన్యులు సైతం ఆసక్తి కనబరుస్తున్నారు. 2024-25 అకడమిక్ ఇయర్ జూన్ మాసంతో మొదలవుతున్న నేపథ్యంలో పిల్లల చదువులు, ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువులు ఇతర అవసరాలు పెరగనున్న నేపథ్యంలో సామాన్యుల కుటుంబాల్లో ఆందోళన కనిపిస్తోంది.



ఓట్ల లెక్కింపులో పొరపాట్లు ఉండరాదు

- జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి - రాయచోటి

కౌంటింగ్ ప్రక్రియలో ఆయా అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓట్ల లెక్కింపు విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిషోర్ రిటర్నింగ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఆర్‌ఒలు, ఎఆరఒలు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్‌లకు ఇవిఎం, పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల ఓట్ల లెక్కింపుపై హాండ్స్ ఆన్ ట్రైనింగ్ (మాక్ కౌంటింగ్ శిక్షణ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రక్రియలో అత్యంత ముఖ్యమైన కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకమైన రీతిలో ప్రశాంత వాతారణంలో నిర్వహించాలన్నారు. రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపునకు రాజంపేట పార్లమెంట్, జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 12 కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఇందులో ప్రతి కౌంటింగ్ హాలులో 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తారని, ఆయా నియోజకవర్గాలలో పోలైన ఓట్ల సంఖ్యను బట్టి 17 నుండి 21 రౌండ్ల వరకు ఇవిఎం కౌంటింగ్ ఉంటుందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ నిమిత్తం ఆయా నియోజకవర్గ కౌంటింగ్ హాలులో రెండు నుంచి నాలుగు టేబుల్స్ వరకు ఏర్పాటు చేస్తారని చెప్పారు. రాజంపేట పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ నిమిత్తం విడిగా ఒక కౌంటింగ్ హాలులో 20 టేబుల్స్ ఏర్పాటు చేసి లెక్కిస్తారని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం ప్రతి టేబుల్‌కు ఒక ఎఆర్‌ఒ ఒక సూపర్‌వైజర్ ఇద్దరు అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని పేర్కొన్నారు. ఇవిఎం కౌంటింగ్ నిమిత్తం ప్రతి టేబుల్‌కు ముగ్గురు సిబ్బంది ఉంటారని ఇందులో ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. ఈ మేరకు ఇవిఎంలలోని ఓట్ల కౌంటింగ్ నిమిత్తం అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు 154 మంది సూపర్‌వైజర్లు, 175 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 138 మంది మైక్రో అబ్జర్వర్లు మొత్తం 467 మంది సిబ్బందిని నియమించామని చెప్పారు. పార్లమెంటుకు సంబంధించి 143 మంది సూపర్‌వైజర్లు, 168 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 140 మంది మైక్రో అబ్జర్వర్లు మొత్తం 451 మందిని నియమిస్తున్నారని, మొత్తం అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధించి రిజర్వుతో సహా 918 మంది సిబ్బందిని నియమించారని పేర్కొన్నారు.ఓట్ల లెక్కింపు సిబ్బంది ఎటువంటి కంగారు, గందరగోళం లేకుండా ప్రశాంతమైన మనస్సుతో కౌంటింగ్ విధులకు హాజరు కావాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది విధులకు సంబంధించిన 3వ ర్యాండమైజేషన్ అదేరోజు ఉదయం అబ్జర్వర్ల సమక్షంలో నిర్వహించి కౌంటింగ్ టేబుల్స్ కేటాయిస్తారని చెప్పారు. కాబట్టి కౌంటింగ్ అధికారులు, సిబ్బంది అందరూ కౌంటింగ్ రోజు ఉదయం 5 గంటలకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. తమకు కేటాయించిన నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ సెంటర్‌కు వెళ్లి రిటర్నింగ్ అధికారికి రిపోర్ట్ చేయాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం జారీ చేసిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. శిక్షణా సమయంలో అన్ని అంశాలపై క్షుణ్ణంగా అవగాహన పెంచుకోవాలని, ఏదైనా సమస్య ఎదురైతే రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, వాటిని సిబ్బందికి శిక్షణలో తెలియజేయడమే కాక, నేడు స్వయంగా హాండ్స్ ఆన్ శిక్షణ కూడా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సరైన కారణం లేకుండా పోస్టల్ బ్యాలెట్ ఓటును తిరస్కరించకూడన్నారు. మరలా ఈనెల 29 నుంచి 31 వరకు మరొక దఫా శిక్షణ ఇస్తారని, ఈ శిక్షణ ద్వారా మరింత నైపుణ్యాన్ని పెంపొందించుకొని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతం చేయాలని చెప్పారు. సిబ్బంది తమ సందేహాలను రిటర్నింగ్ అధికారిని అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ సత్యనారాయణరావు, ఆయా నియోజకవర్గ రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, తాసిల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపుపై అధికారులతో మాట్లాడుతున్న అభిషిక్త్ కిషోర్

నాణ్యమైన భోజనాన్ని అందించాలి : డిఇఒ

వంటల పోటీలో గెలుపొందిన మహిళకు షీల్డ్ ఇస్తున్నడిఇఒ

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్నం భోజనంలో నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ఎమ్‌డిఎం డైరెక్టర్ వారి ఆదేశాల మేరకు పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే మధ్యాహ్నం భోజనానికి సంబంధించిన వంట మనసులు, వంట సహాయకులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో 138 సభ్యులు హాజరయ్యారు. అనంతరం వంటల పోటీ కార్యక్రమంలో గెలుపొందన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్టేట్ కో-ఆర్డినేటర్ రవి నాయక్, మండల విద్యాశాఖ అధికారి-2 రాయచోటి సి.వెంకట శివారెడ్డి, స్టేట్ రిసోర్స్ పర్సన్ ఎ.నాగలక్ష్మమ్మ, మండల విద్యాశాఖ కార్యాలయం సిబ్బంది, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

త్యాగానికి మారుపేరు రమాబాయి

రమాబాయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పీలేరు

సమాజ శ్రేయస్సు కోరి రమాబాయి చేసిన త్యాగాలు మరువలేనివని వక్తలు అన్నారు. సోమవారం పీలేరు మండల మాలమహానాడు కార్యాలయంలో మండల అధ్యక్షులు గుండ్లూరు రవీంద్ర ఆధ్వర్యంలో ఆదర్శమూర్తి రమబాయి అంబేద్కర్ 89వ వర్ధంతి మండల ఉపాధ్యక్షులు బద్దె భానుప్రకాష్ అధ్యక్షతన జరిగింది. రమబాయి చిత్రపటానికి మాలమహానాడు సీనియర్ నాయకులు కె.గటప్ప, జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ మనకు విద్య, గూడు, స్వేచ్ఛగా బతికే జీవితం ఇచ్చారని అందరం చెప్పుకుంటాం. కానీ ఇవన్నీ మనకు ఇచ్చిన అయన తన కుటుంబానికి ఏమిచ్చాడని ప్రశ్నించుకుంటే, ఆయన భార్య రమబాయి పోరాటం మాత్రం మనకు కనిపిస్తుందన్నారు. అణగారిన వర్గాల కోసం ఆయన చేసిన ప్రతి పోరాటంలోనూ చరిత్ర గుర్తించలేని రమాబాయి త్యాగాన్నిగుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆమె చేసిన త్యాగం, పోరాటం ఎప్పటికి మరువలేనిదని పేర్కొన్నారు. ఈ విశ్వం ఉన్నంతవరకూ ఆమె త్యాగాలు చెరపలేని చరిత్ర అని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, రాయలసీమ జిల్లాల సహాయ కార్యదర్శి నగరిమడుగు సుభాష్, భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు, ముల్లంగి కృష్ణయ్య, చౌడప్ప, తదితరులు పాల్గొన్నారు.

కాలువను పరిశీలిస్తున్న వైస్ ఎంపిపి మిట్టపల్లి

మురుగు కాలువ పనులు పరిశీలన

ప్రజాశక్తి - గాలివీడు

గ్రామ పంచాయతీలోని రవిచంద్ర స్కూలుకు వెళ్లే దారిలో ఉన్న ప్రధాన మురుగు కాలువ పనులను సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్ చేపట్టారు. సోమవారం వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషణ్ రెడ్డి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు సలహాలిచ్చారు. పనులు త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. మురుగునీరు పాఠశాల వీధిలోకి వెళ్లకుండా వెంటనే కాలువల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు.

నేడు కౌంటింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి - రాయచోటి

నేడు జిల్లా, డివిజన్ స్థాయిలలో ఎన్‌ఆర్‌కెఆర్ ఐటి అప్లికేషన్, ఇటిపిబిఎస్ టీమ్‌లకు ఎన్నికల కౌంటింగ్ పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ సోమవార ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో మంగళవారం ఉదయం 10.00 గంటలకు ఇసిఐ వెబ్‌సైట్‌లో పట్టిక, డేటా ఎంట్రీ పట్టిక, ఐటి బృందానికి శిక్షణ, ఇటిపిబిఎస్ జట్లకు మధ్యాహ్నం సెషన్‌లో మధ్యాహ్నం 2.00 గంటలకు శిక్షణ కార్యక్రమం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహిస్తారన్నారు. శిక్షణ కార్యక్రమానికి పైన పేర్కొన్న టీమ్ సభ్యులందరినీ శిక్షణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు.

వ్యక్తిపై ఫోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

బి.కొత్తకోట పోలీసులు బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన వ్యక్తిపై సోమవారం ఫోక్సో కేసు నమోదు చేశారు. పిటిఎం మండలం మల్లెలకు చెందిన ఆంజనేయులు బి.కొత్తకోటలో ఉన్న వారి దగ్గరి బంధువైన బాలికను లొంగదీసుకుని అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో మేరకు బి.కొత్తకోట సిఐ సూర్యనారాయణ ఫోక్సో చట్టం కింద అత్యాచారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, తమ పిల్లల పట్ల నిఘా ఉంచాలన్నారు. ఎవరైనా ఆడపిల్లల పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వృద్ధాశ్రమంలో దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

ఆదర్శమూర్తి శ్రీనివాసులు నాయుడు

ప్రజాశక్తి-పీలేరు

ఆప్యాయత, అనురాగాల ఆదర్శమూర్తి అయిన వడ్లమూడి శ్రీనివాసులు నాయుడు విద్యాప్రదాతగా కూడా ఖ్యాతి పొంది తమ విద్యార్థుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని వక్తలన్నారు. పీలేరు విఎస్ఎన్ సిద్ధార్థ విద్యా సంస్థల వ్యవస్థాపకులు వడ్లమూడి శ్రీనివాసులు నాయుడు 13వ వర్ధంతి కార్యక్రమం సోమవారం ఆ విద్యాసంస్థల అధినేత్రి వడ్లమూడి మాధవి ఆధ్వర్యంలో కలికిరి సమీపంలోని సర్వోదయ వృద్ధాశ్రమంలో ఆడంబరంగా జరిగింది. ఈ సందర్భంగా మాధవి వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వారికి దుస్తులు పంపిణీ చేసి తన భర్త ఆదర్శాన్ని గుర్తు చేశారు. వారికి భోజన ఏర్పాట్లు చేసి, ఆశ్రమ వాసులతో కలిసి విఎస్ఎన్ విద్యాసంస్థల అధినేత్రి వడ్లమూడి మాధవి, తమ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో సహబంతి భోజనం చేశారు. ముందుగా శ్రీనివాసులు నాయుడు సమాధి వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి, ఆయన ఆత్మ శాంతి కోరుతూ అందరూ నివాళులు అర్పించారు.

'సీమ' ప్రజలకు సేవలందించిన మొదటి కలెక్టర్ థామస్ మన్రో

ప్రజాశక్తి -కడప అర్బన్

జిల్లా ప్రజలకే కాకుండా, రాయల సీమ ప్రాంతానికి సేవలందించిన గొప్ప వ్యక్తి, మొదటి కలెక్టర్ థామస్ మన్రో అని వరల్డ్ పీస్ అంబాసిడర్ ఆఫ్ క్రైస్ట్, సర్ థామస్ మన్రో సేవా సమితి చైర్మన్ బిషప్ డాక్టర్ కె. సామ్యూల్ బాబు అన్నారు. సోమవారం ఆర్‌కె నగర్ లోని షాలోమ్ ప్రార్థనా మందిరం ఆవరణలో మన్రో జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బిషప్ మాట్లాడుతూ 1800 సంవత్సరం నుంచి 1807 వరకు థామస్ మన్రో కడప జిల్లా మొదటి కలెక్టర్‌గా పని చేసి జిల్లా ప్రజలకు అత్యున్నత సేవలందించిన మహనీయుడని కొనియాడారు. తెల్ల దొరలలో తెలుగు ప్రజలు మరువురాని అగ్రగణ్యుడు సర్ థామస్ మన్రో అని చెప్పారు. పేదల ప్రజలను దోచుకుంటున్న పాలెగాళ్లను అణచి వేసి భూమి సిస్తును రద్దు చేసి పేదలకు భూమి పై హక్కు కల్పించిన మహోన్నతుడు మన్రో అన్నారు. కార్యక్రమంలో రెవ పాస్టర్ స్వర్ణన్ రత్న కుమార్, హెబ్సిబా, ప్రణూష , స్పందన, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి కడపలోని కెఎస్‌ఆర్‌ఎం, కెఒఆర్‌ఎం క్రికెట్ మైదానాలలో ఎసిఎ సౌత్ జోన్ సీనియర్ మెన్స్ వన్డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. ఈ టోర్నమెంటులో ఆంధ్ర సౌత్ జోన్‌కు చెందిన కడప, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు, అనంతపురం జట్లు పాల్గొంటున్నాయి. లీగ్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగనున్నాయి. టోర్నమెంట్‌లో పాల్గొనే ఐదు జిల్లాల జట్ల క్రీడాకారులకు, మ్యాచ్ అఫీషియల్స్‌కు, కోచ్, మేనేజర్లకు కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ అన్ని వసతి ఏర్పాట్లను సిద్ధం చేసింది. అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌కు మైదానాలను జిల్లా క్రికెట్ అసోసియేషన్ సిద్ధం చేసింది. అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. క్రికెట్ మైదానాలను ఆటకు అనువుగా క్యూరేటర్లు బాలరాజు, హరి సిద్ధం చేశారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, ఆటకు అణువుగా, ఆట సజావుగా జరిగేందుకు పిచ్, అవుట్ ఫీల్డ్ ను క్యూరేటర్లు, గ్రౌండ్స్ మెన్లు సిద్ధం చేశారు. టోర్నమెంట్ ప్రారంభం మొదటి రోజు మంగళవారం కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం-కడప జట్ల మధ్య, కెఒఆర్‌ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్ తెలిపారు.

వైవీయూ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ సంస్థ ప్రొద్దుటూరులోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్, బీటెక్ (డిప్లమా) 8వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింతా సుధాకర్ విడుదల చేశారు. సోమవారం విశ్వవిద్యాలయంలోని తన ఛాంబర్‌లో వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్.ఈశ్వర్ రెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య నాగరాజు, వైవీయూ ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తో కలిసి పరీక్ష ఫలితాల గణాంకాలను పరిశీలించారు. ఫలితాల విడుదల అనంతరం ఆయన మాట్లాడుతూ బిటెక్, బిటెక్ (డిప్లమో) ఎనిమిదవ సెమిస్టర్ సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, మెటలర్జీ అండ్ మెటీరియల్ టెక్నాలజీ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత లభించిందన్నారు. గత నెలలో జరిగిన ఈ పరీక్షల ఫలితాలు త్వరితగతిన విడుదల చేసిన వైవీయూ పరీక్షల విభాగాన్ని విసి అభినందించారు. ఉత్తమ ఫలితాలు లభించిన సందర్భంగా వైవీయూ డాక్టర్ వైయస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులను, విద్యార్థులను ప్రశంసించారు.

ఫలితాలు విడుదల చేస్తున్న విసి సుధాకర్

ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతూ యూనిఫాం, పుస్తకాలు అమ్ముకుంటూ విద్యను వ్యాపారంగా మార్చిన నారాయణ విద్యా సంస్థపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నారాయణ పాఠశాల తీరును నిరసిస్తూ సోమవారం విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ సర్వేపల్లి, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు చేసి ఆర్ఎస్ రోడ్డులో ఉన్న నారాయణ పాఠశాల ఇప్పటికే సుమారు 300 అడ్మిషన్లు పూర్తి చేశారని ఆరోపించారు. నిబంధనలకు వ్యతిరేకంగా అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారని, విద్యాశాఖ అధికారులు మామూళ్ల మత్తులో పడి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. ప్రశ్నించిన విద్యార్థి సంఘాల నాయకుల పై పాఠశాల యాజమాన్యం రౌడీ మూకలను పురమాయించి దాడులకు పాల్పడే విధంగా ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. ఎజిఎం శంకర్ రెడ్డి, ఆర్ఐ మల్లిఖార్జున, ప్రిన్సిపల్ గీత తమపై దాడికి ప్రోత్సాహించారని, విద్యాశాఖ అధికారులు వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ, చంగయ్య, మనోహర్, బబ్లు, సాయికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి

ప్రజాశక్తి - రాయచోటి : ప్రథమ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 60వ వర్ధంతి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అల్లా బకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి పంచవర్ష ప్రణాళిక ప్రవేశపెట్టి దేశాభివృద్ధికి ఎనలేని సేవలు ఆయన అందించారని కొనియాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం 9 ఏళ్లు జైలు జీవితం గడిపిన దేశ భక్తుడు నెహ్రూ ప్రధాని అయ్యే నాటికి దేశం అన్ని రంగాలలో ఎంతో వెనుకబడి ఉండేది అన్నారు. తన పరిపాలనా దక్షతతో, దూరదృష్టితో, దార్శనికతతో నెహ్రూ దేశాన్ని అన్ని రంగాలలో ప్రగతి పథాన నడిపించారని చెప్పారు. కార్యక్రమంలో డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్ బాషా, కిసాన్ సెల్ అధ్యక్షులు చెన్నకృష్ణ, జిల్లా మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ అలీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లోకేష్‌రెడ్డి

గొడవలు సృష్టిస్తే చర్యలు తప్పవు : ఎస్ఐ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

గ్రామాలలో గొడవలకు పాల్పడితే తీవ్ర చర్యలు తీసుకుంటామని స్ఐ లోకేష్‌రెడ్డి ప్రజలను హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మదనపల్లి రూరల్ సర్కిల్ సిఐ సద్గురుడు, స్థానిక పోలీసులు, బిఎస్ఎఫ్ కేంద్ర బలగాలతో కలసి తవళంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం గ్రామ ప్రజలను సమావేశపరిచి శాంతి భద్రతలపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. నాటుసారా తయారుచేసిన, విక్రయించినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలను జూన్ నెల 4వ తేదీన ఎన్నికల కమిషన్ వెల్లడించనుందన్నారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో గ్రామాలలో గొడవలకు పాల్పడి, శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక ఆవేశాలకు పోయి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణపై నిత్యం పోలీసులు పహారా కాస్తుంటారని, ఎటువంటి సంఘటన జరిగిన వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ఫలితాలు ఎటుఉన్నా, అధికారం ఎవరిదైనా ప్రజలు కలసిమెలసి ఉండాలని తెలిపారు. ఈ తనిఖీలలో స్థానిక పోలీసులు, బిఎస్ఎఫ్ కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

భగవద్గీత ప్రతులను స్థానికులకు అందజేస్తున్న సభ్యులు

భగవద్గీతపై ప్రచారం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని అగ్రహారం పంచాయతీ చెరువు ముందరపల్లె, చింతపర్తివారిపల్లె, పూలవాండ్లపల్లె, రెడ్డివారిపల్లె, బండమీదపల్లె అగ్రహారం గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. స్థానికులకు భగవద్గీత ప్రతులను కనీస ధరకు అందజేశారు. హిందువులందరు భగవద్గీతను తప్పనిసరిగా చదవాలని సూచించారు. భగవద్గీతతో పాటు అనుబంధ పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో కంభం, బంగారుపాలెం, పలమనేరు, కుప్పం కమిటీల సభ్యులు నర్రా శ్రీనివాసరెడ్డి, తిరుపతయ్య, భాస్కర్, కిరణ్, జ్యోతి, జీవరత్న, కృష్ణ, ఇందిర పాల్గొన్నారు.

మృతి చెందిన గొర్రెలు

కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని సి.గొల్లపల్లి పంచాయతీ రెక్కలకొండపల్లిలో ఆదివారం రాత్రి గొర్రెల మందలో కుక్కలు జోరబడి 12 గొర్రెలను చంపాయని రైతు పూల పాపయ్య తెలిపారు. మృతి చెందిన గొర్రెల విలువ రూ.లక్ష వరకు ఉంటుందని చెప్పారు. గతంలో కూడా ఇదే గ్రామానికి చెందిన కృషమానాయుడు గొర్రెలుపై కుక్కలు డాడీ చేచి 30 గొర్రెలను చంపిన విషయం తెలిసిందే. గొర్రెలపై దాడి చేసే కుక్కలు కలిచేర్ల గ్రామానికి చెందినవిగా గొర్రెల కాపర్లు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పదించాలని గొర్రెల కాపర్లు కోరుకుంటున్నారు.

బెల్ట్ షాపుల నిర్వహణపై నిఘా : ఎస్ఐ

ప్రజాశక్తి- పుల్లంపేట

మాట్లాడుతున్న ఎస్ఐ రఘురాం

మండల పరిధిలో ఎవరైనా బెల్ట్ షాపులు నడిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రఘురాం పేర్కొన్నారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరపకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బెల్ట్ షాపులు నడిపే వారి సమాచారం తెలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలపారు. బెల్ట్ షాపులు పెట్టకుండా మద్యం అక్రమంగా అమ్మకుండా గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలపారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు పాత నేరస్తులు రౌడీ షీటర్లు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి నివాసం ఉంటున్నారా ఇళ్ల దగ్గర పెట్రోల్ డీజిల్ కర్రలు రాళ్ల వంటి హానికర వస్తువులు ఏమైనా ఉన్నాయా అని తనిఖీ చేస్తున్నామని తెలిపారు. హానికర వస్తువులు కలిగి ఉంటే వారిపై చర్యలు తీసు కుంటామని తెలిపారు. ఎన్నికల లెక్కింపు సందర్భంగా ఎలాంటి సంఘటన జరగకుండా ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు జరిగేందుకు సహకరించాలని కోరారు. భవిష్యత్తులో కూడా మండలంలో ఎలాంటి గొడవలు లేకుండా చేస్తామని తెలిపారు. ఓట్ల లెక్కింపు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రజలను రక్షించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు

I.A.NO:75/2024 IN

O.S.NO : 23/2024

ఏదోటి వెంకటేశ్వర్లు, S/o ఏదోటి వెంకటస్వామి, ప్రొప్రయిటర్ శ్రీ శ్రీనివాస ట్రేడర్సు (GST NO:37ACLPY 4955D 2ZO) ఆధార్ నెంబర్ :6272 9576 8415, వయస్సు సుమారు 39సం॥హిందూ, వ్యాపారం & వ్యవసాయం, నివాసం :డోర్ నెంబర్ : 1/59, బస్టాండ్ ఎదురుగా మెయిన్ రోడ్డు, చిట్వేలి పోస్టు& మండలం, అన్నమయ్య జిల్లా.

...పిటీషనరు/ వాది

V/S

సింగనమల షేక్ హబీబ్ S/o సింగనమల కరిముల్లా, వయస్సు సుమారు 29 సంవత్సరాలు, వ్యాపారం, ముస్లిం, నివాసం : డోర్ నెంబర్ 20/146 (పాతది), 2/5-89 (కొత్తది), పాత బజారు, మెయిన్ రోడ్డు, చిట్వేలి పోస్టు మరియు మండలం, అన్నమయ్య జిల్లా. ప్రస్తుతం USAలో నివసిస్తున్నాడు.

...రెస్పాండెంట్ నెంబర్ -3/ప్రతివాది నెంబర్-3

పై నెంబరు కేసులోని పిటిషనరు/వాది పై పిటీషన్ ను /దావాను పై తెలిపిన రెస్పాండెంట్ నెంబర్ 3/ ప్రతివాది నెంబర్ 3పైన తాత్కాలిక మరియు శాశ్వత ఇంజక్షన్లను కోరుతూ పై పిటిషన్ ను మరియు దావాను దాఖలు చేసి యున్నాడు. ఈ విషయమై పై రెస్పాండెంట్ నెంబర్ 3/ ప్రతివాది నంబర్ 3 కు ఏవైనా ఆక్షేపణలు ఉన్నయెడల 27/6/2024 వ తేదీ ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో నీవు గానీ, నీ తరపున వకీలు గానీ హాజరై మనవి చేసుకొనవలయును. లేనంతట పై పిటిషన్ ను మరియు దావాను మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

//By Order of the Court//

కె.సురేంద్ర బాబు, M.Com, B.L.,
అడ్వకేట్, రాజంపేట, 516115,
ఫోన్ :98485 18220

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

వేరుశనగ, టమోటా, ఇతర పంటల సాగుకు అనువైన వాతావరణం

సాగులో ఉన్న టమోటా పంట

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వేరుశనగ, ఇతర పంటల సాగుకు అనువైన వాతావరణం ఏర్పడడంతో ఖరీఫ్ వ్యవసాయానికి అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గం వేరుశనగ, టమోటా, వరి, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేస్తూ ఉంటారు. పంటల సాగుకు ఒక ఏడాది అనుకూలంగా, ఒక ఏడాది ప్రతికూలంగా మారడం రైతులకు ఇబ్బందులకు కలిగిస్తోంది. ఈ ఏడాది ముందస్తు వర్షాలు కురవడంతో వ్యవసాయానికి అనువైన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికే నియోజకవర్గంలోని తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దమండ్యం, బి.కొత్తకోట, కురబలకోట, పిటిఎం మండలాల్లో చాలా మంది రైతులు టమోటాను సాగు చేశారు. మరి కొంతమంది రైతులు వేరుశనగ సాగుకు పొలాలను దుక్కులు చేసి సిద్ధం చేశారు. మే, జూన్, జులై టమోటా పంటకు సీజనుగా భావిస్తారు. ఈ నెలల్లో మదనపల్లి డివిజనులోని వివిధ మండలాల నుండి రైతులు అధిక మొత్తంలో టమోటోలను ఆసియాలోనే అతిపెద్ద టమోటా మార్కెట్ యార్డుకు మదనపల్లి, ములకలచెరువుకు తీసుకుపోయి ఆదాయం గడిస్తుంటారు.గత ఏడాది టమోటా ధరలు ఆశాజనకంగా ఉండడంతో, ఈ ఏడాది సైతం రైతులు టమోటా సాగు వైపు మొగ్గు చూపారు. ఇక వేరుశనగ కాయల ధరలు సైతం రైతులకు లాభాలు తెచ్చిపెట్టాయి. రైతులు పంటలను కాపాడుకోవడం ఎంతో ముఖ్యం.అటు వేరుశనగ,టమోటా ఇతర పంటలు సైతం రోగాల బారిన పడుతున్నాయి.వాటి నియంత్రణకు రైతులు ఎన్ని రకాల మందులు వాడినప్పటికీ ఒక్కోసారి దిగుబడి సరిగ్గా రావడం లేదు.దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులు వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.ముఖ్యంగా రసాయన ఎరువుల వాడకం వల్ల పంటల దిగుబడి పడిపోవడం కాకుండా, భూసారం తగ్గిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. దృష్టిలో ఉంచుకొని రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాల్సిన తరుణం ఆసన్నమైంది. ప్రధాన పంటలతో పాటు చిరుధాన్యాలను సాగు చేస్తే అటు ప్రజల ఆరోగ్యానికి ,ఇటు రైతులకు లాభసాటిగా ఉంటుంది. ఇకపోతే దేశానికి వెన్నెముక లాంటి అన్నదాతల సంక్షేమం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చొరవ చూపాలన్నారు. వారికి పెట్టుబడి సాయాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని వ్యవసాయం నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ ఏడాది వ్యవసాయం లాభసాటిగా మారే రైతుల జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తున్నారు.

సాగులో ఉన్న వేరుశనగ పంట

విద్యతో అన్ని రంగాల్లో రాణింపు : 'చిక్కాల'

ఉత్తమ విద్యార్థులకు నగదు అందజేస్తున్న బాలాజీరావు

ప్రజాశక్తి - నందలూరు

ప్రస్తుత పోటీ ప్రపంచంలో, విద్యార్థులు కష్టపడి చిత్తశుద్ధితో ప్రణాళిక బద్ధంగా చదివితేనే అన్ని రంగాల్లో రాణిస్తారని కళాబంధు చిక్కాల బాలాజీ రావు తెలిపారు. ప్రముఖ రంగస్థల నటులు, కళాబంధు చిక్కాల బాలాజీ రావు సతీమణి దివంగత చిక్కాల జయలక్ష్మి స్మారకార్థం మండల స్థాయిలో ప్రతిభ చూపిన పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు నగదు పురస్కారాలను రూ.ఐదు వేలు చొప్పున అందజేశారు. స్థానిక నందలూరు గ్రంథాలయంలో సోమవారం ఎస్టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లం అశోక్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి పదవ తరగతి పరీక్షల్లో అత్యున్నత మార్కులు 572 /600 సాధించిన టంగుటూరు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థి గాదెన హేమంత్, మండలంలోని మహాత్మ జ్యోతిరావుపూలే బిసి బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ ఎంపీసీ లో 962/1000 మార్కులు సాధించిన విద్యార్థిని ఆర్.విజయ హాసిని లకు చిక్కాల బాలరాజు రావు, అల్లం అశోక్ కుమార్ ల చేతుల మీదుగా నగదు అవార్డులను అందజేశారు. అనంతరం ఎస్టియు నాయకులు చిక్కాల బాలాజీరావును పట్టు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టియు నాయకులు మోహన్ రాజు, లీలా కృష్ణయ్య, భరత్ కుమార్, జెవి రమణ, చలపాటి నరసింహారావు, వెంకటేశ్వరరావు, రెడ్డన్న, యుటిఎఫ్ నాయకులు హరినాథ్, కృపానందం, బీసీ గురుకుల పాఠశాల ప్రతినిధి ప్రశాంత్, ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, ఎమ్మార్సీ అటెండర్ల సంఘం జిల్లా అధ్యక్షులు హరిబాబు పాల్గొన్నారు.

గోవింద నామస్మరణతో మార్మోగిన జమ్మలమడుగు

వైభవంగా రథోత్సవం - అలరించిన కోలాటం, చెక్కభజన - భారీగా అన్నదానాలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

శ్రీనారాపుర వెంకటేశ్వర స్వామి రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 30వ తేదీ వరకు శ్రీనారాపుర వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం జమ్మలమడుగు పట్టణం వేలాదిమంది భక్తులతో శ్రీదేవి-భూదేవి సమేతులై శ్రీనారాపుర వెంకటేశ్వర స్వామి పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కన్నుల పండువలా రథోత్సవాన్ని నిర్వహించారు. రథోత్సవంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వేష ధారణలో భక్తుడు ఆకట్టుకున్నాడు. రథో త్సవం సందర్భంగా భక్తులు గోవింద నామ స్మరణతో పరవశించి పోయారు. జమ్మలమడుగు గోవింద నామస్మరణతో మార్మోగింది. రథో త్సవాన్ని చూసేందుకు భక్తులు జమ్మల మడుగు పట్టణం నుంచేకాక జిల్లా నలుమూలల నుంచి, చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాదిగా తరలి వచ్చారు. శ్రీవారి రథం ఉదయం దేవాల యం వద్ద నుంచి తేరురోడ్డు, తాడిపత్రి రోడ్డు, స్టేట్ బ్యాంక్ మీదుగా పాత బస్టాండు కూడలిలోకి చేరుకోవడంతో ఒక్కసారిగా జమ్మలమడుగు భక్తులతో జన సంద్రంగా మారింది. అక్కడి నుంచి మార్కెట్ వీధి, ఆంజనేయ స్వామి దేవాలయం వరకు మధ్యాహ్నం చేరుకుంది. అక్కడి నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు రథం ప్రారంభమై మెయిన్ బజారు, కన్యకా పరమేశ్వర స్వామి వీధి, అమ్మవారి శాల, పలగాడి మోటు నుంచి తిరిగి ఆలయ ప్రాంగణంలోకి సాయంత్రానికి చేరుకుంది. రథోత్సవం ప్రారంభం నుంచి పుర వీధులను నీటితో తడుపుతూ స్వామి వారిని ఊరేగించారు. భక్తులకు ఎక్కడికక్కడ మజ్జిగ ప్యాకెట్లు, రస్నా, పానకం దుకాణాల ముందర, ట్రాక్టర్లతో అందించారు. చెక్కభజన, కోలాటం ఎంతగానో ఆకట్టుకున్నాయి. శ్రీవారి సేవా సమితి ఆధ్వర్యంలో అలంకార్ ఫంక్షన్ హాల్, తహశీల్దార్ కార్యాలయ పరిసరాల్లో అన్నదానం నిర్వహించారు. డిఎస్‌పి టిడి యశ్వంత్ భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమల్లో ఉన్న ప్పటికీ భక్తులకు ఇబ్బంది కలిగించకుండా పోలీ సులు తగు చర్యలు తీసుకున్నారు. గోవింద నామస్మరణతో రథోత్సవం ఘనంగా ముగిసింది.

కన్నుల పండువగా సాగుతున్న రథోత్సవం

గోవిందా ఏమిటీ తతంగం

ప్రతి ఏడాది నారాపుర స్వామి తిరుణాల అంటే కేవలం ప్రజలకు ఆనందమేకాక శ్రీవారికి కూడా ఆదాయం సమకూరేది. ఈ ఏడాది టిటిడికి ఆదాయం లేకుండా పోయింది. కారణం ఎలక్షన్ కోడ్ ఉండడమే. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు డిఎస్‌పి, ఇతర ఉన్నత అధికారుల సహకారంతో దుకాణాలు, ఎగ్జిబిషన్‌కు వేలంపాటను ఆపేశారు. అయినప్పటికీ కొంతమంది లెక్క చేయకుండా దేవాలయం పక్కనే ఎగ్జి బిషన్ ఏర్పాటు చేయడంతో పోలీసులు భారీగా మోహరించాల్సి వచ్చింది. ఏ చిన్న సమస్య తలెత్తిన పోలీస్ యంత్రాంగం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది.

ఎన్‌టిఆర్ జయంతిని విజయవంతం చేయండి

ప్రజాశక్తి-కలికిరి

నందమూరి తారకరామారావు 101వ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు నిజాముద్దీన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకి కలికిరీ మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అమర్నాథ్‌రెడ్డి భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలు మాలలతో ఘన నివాళులు అర్పించే కార్యక్రమం ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాల్సిందిగా కోరారు.

ఘనంగా ఎంపిపి పుట్టినరోజు వేడుకలు

రాజేంద్రనాథ్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - వీరబల్లి

మండలంలో ఎంపిపి గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను సోమవారం తన స్వగృహంలో ఘనంగా నిర్వహించుకున్నారు. పార్టీలకు అతీతంగా అతిపెద్ద సంఖ్యలో రాజకీయ నాయకులు హాజరై పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. రాజేంద్రనాథ్‌రెడ్డి కేక్ కట్ చేయగా మాజీ ఎంపిపి విజయభాస్కర్ రెడ్డి, వైసిపి యువ నాయకుడు గాలివీటి వీరనాగిరెడ్డి, మాజీ ఎంపిపి నాగభూషణం, సర్పంచ్ నాగిరెడ్డి, గోపీనాథ్ రెడ్డి, ఎంపిటిసి సీతారామరాజు, సింగల్ విండో చైర్మన్ అమరనారథరెడ్డి, రామాంజులు రెడ్డి మిగతా ప్రజా ప్రతినిధులు కేకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.శాలువా కప్పి, గజమాలతో ఎంపిపిని ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మంచి చేసే మనసున్న మహారాజు మన రాజేంద్రనాథ్‌రెడ్డి అని కొనియాడారు.

41 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - నందలూరు : మండలంలోని నల్ల తిమ్మయ్యగారిపల్లె గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 41 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై సోమవారం మాట్లాడుతూ ఉదయం పై అధికారుల ఉత్తర్వుల మేరకు నల్లతిమ్మాయపల్లె గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా, అదే గ్రామానికి చెందిన పోలి రామసుబ్బారెడ్డికి చెందిన గడ్డివాములో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నిల్వ చేసిన 41 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకోని, ముద్దాయిల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్ల పరమేశ్వర్, ధనంజయరెడ్డి కానిస్టేబుళ్ల రవి, వర్మ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు చూపిస్తున్న ఎస్ఐ అబ్దుల్ జహీర్

మాట్లాడుతున్న ఎంపిడిఒ కృష్ణమూర్తి

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఎంపిడిఒ కృష్ణమూర్తి అన్నారు. సోమవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ సమావేశం మందిరంలో నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల నియమావళికి లోబడి ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజా సమస్యలపై అధికారుల దృష్టి సారించాలన్నారు. గుర్తించిన సమస్యలను సంబంధిత శాఖ అధికారుల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆర్డబ్ల్యూఎస్ ఎఇ అశోక్ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఆ సమస్యలను పరిష్కరించి ఉన్నత అధికారులకు నివేదికలు పంపి ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కోసువారిపల్లె పిహెచ్‌సి డాక్టర్ ముని కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో క్షయ వ్యాధి నివారణకు బిసిజీ వ్యాక్సిన్ కార్యక్రమాల్లో జరుగుతున్నాయన్నారు 18 సంవత్సరాలు పైబడిన వారికందరికీ ఈ వ్యాక్సిన్ వేసుకోవాలన్నారు. అందరూ సమిష్టిగా సహకరిస్తేనే క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించగలమన్నారు. కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, వైస్ ఎంపిపి కరీం, వైసిపి మండల కన్వీనర్ చౌడేశ్వరి, కో-ఆప్షన్ సభ్యుడు జమాల్ బాషా, మండలాభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

ప్రజాశక్తి - రామసముద్రం

ప్రేమ జంట సాకేత్‌కుమార్, రితిక

మండలంలోని మాలే నత్తం పంచాయతీ సింగంవారిపల్లి గ్రామానికి చెందిన రామ్మోహన్ కుమారుడు సాకేత్ కుమార్ (23), చిత్తూరు టౌన్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతంలోని సురేంద్ర కుమార్తె రితిక (19), ఒకరినొకరు ఇష్టపడి మేజర్ వయస్సు కలిగి ఉండటంతో తిరుమలలో వివాహం చేసుకున్నారు. అనంతరం వారికి రక్షణ కావాలని రామసముద్రం పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయంపై అమ్మాయి తల్లిదం డ్రులను ఫోన్ ద్వారా సంప్రదించగా వారు తమకు ఆ అమ్మాయి వద్దు తమకు ఆ అమ్మాయికి ఎటువంటి సంబంధం లేదని తాము ఎక్కడికి రాము అని తేల్చి చెప్పారు. అబ్బాయి తల్లిదండ్రులు రామ్మోహన్, గంగులమ్మలను పిలిపించి అమ్మాయిని జాగ్రత్తగా చూసుకోవాలని అమ్మాయి ఇష్ట ప్రకారం తన భర్త సాకేత్ కుమార్‌తో పెద్దల సమక్షంలో పంపించామని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

క్రైం కార్నర్

నాటు తుపాకీతో పట్టుబడిన నిందితులు

నాటు తుపాకీ స్వాధీనం : ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

అక్రమ సార విక్రయాల నివారణలో భాగంగా జరిపిన తనిఖీలలో నాటు తుపాకీ స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు స్థానిక ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం నిమ్మనపల్లి పంచాయతీ ముదిరెడ్డిగారిపల్లి (గూడుపల్లి), నాగులయ్యగారిపల్లె సమీప ప్రాంతాలలో స్థానిక పోలీసులతో, బిఎస్ఎఫ్ బలగాలతో కలసి తనిఖీలు నిర్వహిస్తుండగా వన్యప్రాణుల వేటకు ఉపయోగించే నాటు తుపాకి ముదిరెడ్డిగారిపల్లె (గూడుపల్లె)కు సమీపంలోని బసప్ప వరి పొలాల్లో స్వాధీనం చేసుకున్నామన్నారు. జంతువుల వేటలో నాటు తుపాకీ ఉపయోగిస్తున్న నాగులయ్యగారిపల్లెకు చెందిన సికోళ్ల గిరి, ముదిరెడ్డిగారిపల్లె (గూడుపల్లె)కు చెందిన గరివి వెంకటేష్‌లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి నాటు తుపాకీ స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మృతి చెందిన శ్రీరామదాసు

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బి.కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే పట్టణంలోని బెంగళూరు రోడ్డు నందు అయ్యవారిపల్లి మలుపు వద్ద కొత్తపల్లికి చెందిన శ్రీరామదాసు (55) అలియాస్ దాస్ బి.కొత్తకోట పట్టణంలో ప్రయివేట్ బస్సు వాటర్ సర్వీసింగ్, డాబాలో హెల్పరుగా పనిచేస్తూ జీవనం సాగించేవాడు.కిట్ట డాబాలో పని ముగించుకుని రాత్రి 10.30 గంటలక సమయంలో ఇండియన్ పెట్రోల్ బంకు వద్దకు నడుచుకుని వస్తుండగా బి.కొత్తకోట నుంచి శంకరాపురం వైపు ద్విచక్ర వాహనంలో వెళ్తున్న వ్యక్తి ఢీకొనడంతో అక్కడకక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి ఎఎస్ఐ బొజ్జ నాయక్ వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడు శ్రీరామదాసు భార్య కొత్తపల్లి అంగన్వాడీ కేంద్రంలో హెల్పరుగా పనిచేస్తోంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.ఇక తమకు దిక్కెవరని మృతుడి భార్య, పిల్లలు బోరున విలపించడం పలువురిని కంటతడి పెట్టించింది.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన గ్రామస్తులు

ప్రజాశక్తి-మదనపల్లి

చికిత్స పొందుతున్న రమణ

మదనపల్లి మండలంలోని దాదినాయుని తండా వద్ద సైడు కాలువలో పడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి ప్రాణాలను స్థానికులు కాపాడారని తాలూకా ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. అనంతపురం జిల్లా, నల్లచెరువుకు చెందిన రమణ (46) సొంత పనిపై మండలంలోని పెంచుపాడుకు వెళ్ళాడు. తిరిగి ఇంటికి వచ్చేందుకు దాదినాయన తండా బస్ స్టాప్ వద్ద మోరి మీద కూర్చుని ఉండగా, ప్రమాదవశాత్తు సైడు కాలువలో పడి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి 108లో జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్సలు పొందుతున్నాడని తెలిపారు.